వాయిస్ టుడే

హైదరాబాద్
మంగళవారం, 23 జనవరి, 2024

# విడుదలపై క్లారిటీ!



టాలీవుడ్ సందీప్ కిషన్ హీరోగా నటిస్తోన్న చిత్రం ఊరు పేరు భైరవకోన . వీఐ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్నాడు. వర్ష బొల్లమ్మ ఫీమేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 9న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. అయితే ఇదే సమయంలో రజనీకాంత్ నటించిన లాల్ సలామ్, రవితేజ నటించిన ఈగల్ సినిమాలు విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో సందీప్ కిషన్ సినిమా విడుదల ఆలస్యమవుతుందంటూ వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. అయితే ఈ వార్తలకు ఫుల్ స్టాప్ పెడుతూ ఊరు పేరు భైరవకోన అనుకున్న సమయానికే విడుదలవుతుందంటూ క్లారిటీ ఇచ్చేశాడు సందీప్ కిషన్. పోస్టర్‌ను షేర్ చేస్తూ ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేశాడు సందీప్ కిషన్. ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. విడుదలకు ముందే ఫస్ట్ సింగిల్ నిజమే నే చెబుతున్నా లిరికల్ వీడియో సాంగ్ నెట్టింట టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తూ.. మ్యూజిక్ లవర్స్ మనసు దోచేస్తోంది. ఈ ఒక్క సాంగ్ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తోంది. మరోవైపు రెండో సింగిల్ హమ్మ హమ్మ సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. టైగర్ తర్వాత సందీప్ కిషన్, వీఐ ఆనంద్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. ఈ సారి ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో వస్తున్న వీఐ ఆనంద్ ప్రేక్షకులను ఎలా ఇంప్రెస్ చేస్తాడని ఎక్జయిటింగ్‌గా చూస్తున్నారు.


# అలాంటి సినిమాలు చేయను!



'దంకీ' చిత్రంతో ఇటీవల చక్కటి విజయాన్ని సొంతం చేసుకొంది పంజాబీ సుందరి తాప్సీ. ప్రస్తుతం సక్సెస్ జోష్‌లో ఉన్న ఈ భామ తన తదుపరి సినిమాల కోసం సిద్ధమవుతున్నది. ఈ నేపథ్యంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'యానిమల్' సినిమా గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. అలాంటి కథలో తాను నటించలేనని పేర్కొంది. ఆమె మాట్లాడుతూ 'ఇతర నటీనటుల వ్యక్తిగత జీవితాల గురించి నేను మాట్లాడను. మనది ప్రజాస్వామ్య దేశం. ఎవరికి నచ్చింది వారు ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. నటీనటులందరికి ప్రతిభా పాటవాలతో పాటు కొన్ని బాధ్యతలు ఉంటాయి. వాటిని గౌరవిస్తూ నేను ముందుకు సాగుతాను. వ్యక్తిగతంగా మాత్రం నేను ఆ తరహా కథల్లో నటించలేను' అని చెప్పుకొచ్చింది.

రణభీర్‌కపూర్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందిన 'యానిమల్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను సాధించింది. తండ్రీకొడుకుల అనుబంధం ప్రధానంగా న్యూఏజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే కొందరు మాత్రం ఈ సినిమాపై విమర్శలు చేశారు. హింస పాలు ఎక్కువగా ఉందని, మహిళల గౌరవాన్ని తగ్గించేలా సన్నివేశాలు ఉన్నాయని విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో తాప్సీ చేసిన వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

# జై హనుమాన్‌కు శ్రీకారం




తేజ సజ్జా కథానాయకుడిగా ప్రశాంత్‌వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన 'హను-మాన్' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంది. రెండో వారాంతంలో ఈ సినిమా 200కోట్ల వసూళ్ల మైలురాయిని చేరుకుందని చిత్ర బృందం ప్రకటించింది. తొలి భాగం ముగింపులోనే ఈ సినిమా సీక్వెల్ 'జై హనుమాన్' గురించి హింట్ ఇచ్చారు దర్శకుడు ప్రశాంత్‌వర్మ. తాజాగా 'జై హనుమాన్'కు స్క్రిప్ట్ సిద్ధమైందని ఆయన తెలిపారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా డైరెక్టర్ ప్రశాంత్ వర్మ హైదరాబాద్‌లోని ఓ హనుమాన్ ఆలయంలో నిర్వహించిన యాగంలో పాల్గొని సీక్వెల్ స్క్రిప్ట్‌ను హనుమంతుడి విగ్రహం ముందు ఉంచారు. ప్రీ ప్రొడక్షన్ ప్రారంభించడానికి ఇంతకంటే మంచి సందర్భం తనకు లభించదని అన్నారు. సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని ప్రశాంత్ వర్మ తెలిపారు. కాగా 'హను-మాన్' సక్సెస్ నేపథ్యంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో 'జై హనుమాన్' చిత్రంలో ఆంజనేయుడి పాత్రలో ఓ స్టార్ హీరో నటిస్తాడని, ఈ సినిమాను 2025లో విడుదల చేస్తామని ప్రశాంత్‌వర్మ పేర్కొన్నారు.



# ఆమెతో పోల్చితే ఆనందమే!

'నా సామిరంగ' చిత్రం తెలుగులో తనకు మంచి బ్రేక్‌నిస్తుందని చెప్పింది కన్నడ భామ ఆషిక రంగనాథ్. నాగార్జున కథానాయకుడిగా విజయ్ బిన్ని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆషిక రంగనాథ్ మాట్లాడుతూ 'నాగార్జున వంటి అగ్ర హీరోతో తెరను పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ సినిమాలో నేను పల్లెటూరి అమ్మాయి వరాలు పాత్రలో కనిపిస్తా. తను స్వతంత్ర్య భావాలు కలిగిన అమ్మాయి. సాధారణంగా గ్రామీణ నేపథ్య సినిమాల్లోని కథానాయికలు సున్నిత వ్యక్తిత్వంతో కనిపిస్తారు. కానీ వరాలు అలాంటి అమ్మాయి కాదు. తను ఓ ధిక్కార స్వభావి.సినిమా చూసిన తర్వాత 'అమ్మాయంటే ఇలాగే ఉండాలి' అనుకుంటారు. కథానుగుణంగా నాగార్జునగారికి, నాకు మధ్య మంచి రొమాంటిక్ సీన్స్ ఉంటాయి. కన్నడ, తెలుగు సంప్రదాయాలు ఒకేలా ఉంటాయి. అందుకే ఇక్కడి ఇండస్ట్రీ చాలా సౌకర్యంగా అనిపిస్తున్నది. నాకు సీనియర్ నాయిక అనుష్క అంటే చాలా ఇష్టం. నన్ను కొందరు జూనియర్ అనుష్క అని పిలుస్తుంటారు. అలాంటి గొప్ప నటితో పోల్చడం నాకు ఆనందమే (నవ్వుతూ). గ్లామర్‌తో పాటు అభినయానికి ప్రాధాన్యత ఉన్న పాత్రలను చేయాలనుకుంటున్నా. అలాగే పీరియాడిక్ ఫిల్మ్ చేయాలనుంది. ఏదో ఒకరోజు రాజమౌళిగారి సినిమాలో నటించాలని బలంగా కోరుకుంటున్నా' అని చెప్పింది



## సి.హెచ్ క్రాంతి కుమార్ దర్శకత్వంలో నరేంద్ర మోది బయోపిక్ "విశ్వనేత"

"ముచ్చటగా మూడోసారి కూడా భారత దేశ పాలనా పగ్గాలు చేపట్టడం కేవలం లాంఛనం" అనే అంచనాల నడుమ నరేంద్ర మోదీ బయోపిక్ తెరకెక్కనుంది. "విశ్వనేత" పేరుతో అన్ని భారతీయ భాషల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మాణం కానున్న ఈ చిత్రానికి యువ ప్రతిభాశాలి సి. హెచ్.క్రాంతి కుమార్ దర్శకత్వం వహించనున్నారు. 'వందే మీడియా ప్రయివేట్ లిమిటెడ్' పతాకంపై కశిరెడ్డి శరత్ రెడ్డి నిర్మించనున్న ఈ చిత్రంలో అభయ్ డియోల్, నీనా గుప్తా, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి ముఖ్య పాత్రలు పోషించనున్నారు!! ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి తనయుడు కాలభైరవ సంగీతం సమకూర్చుతున్న ఈ చిత్రం ప్రి ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని త్వరలో సెట్స్ కు వెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. ఆర్టికల్ 370 రద్దు, డిమోనిటైజేషన్, జి.ఎస్.టి, అయోధ్య రామ మందిర నిర్మాణం వంటి ఎన్నో సంచలనాలతో కోట్లాది భారతీయుల గుండెల్లో కొలువుదీరి.. "యూనిఫామ్ సివిల్ కోడ్" అమలు దిశగా అడుగులు వేస్తున్న నరేంద్రుడి బయోపిక్ లో చాయ్ వాలా స్థాయి నుంచి "విశ్వనేత" గా ఎదిగిన ఆయన మహాప్రస్థానానికి దృశ్యరూపం ఇవ్వనున్నామని సినిమా యూనిట్ చెబుతోంది!!